రంజాన్‌లో 'రౌండ్ ది క్లాక్' సేవలు

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చార్మినార్ డీఈ లింగయ్య

చార్మినార్: రంజాన్ మాసంలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నామని టీఎస్‌ఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం చార్మినార్ డీఈ లింగయ్యగౌడ్ తెలిపారు. ఆదివారం ఫలక్‌నుమా డివిజన్ పరిధిలోని వట్టేపల్లిలో స్థానిక జీహెచ్‌ఎంసీ సిబ్బంది కారణంగా విద్యుత్ కేబుల్ వైర్లు పాడవడంతో కొద్ది సేపు విద్యుత్ సమస్యలు తలెత్తిన విషయం తమ దృష్టికి రావడంతో వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేసి ఘటనా స్థలానికి వెళ్లి మరమ్మతులు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించామన్నారు. తమ సిబ్బంది 'రౌండ్ ది క్లాక్' సేవల్లో ఉండేటట్లు చూస్తున్నామన్నారు. ఎక్కడైనా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే తమ అధికారులతో పాటు సిబ్బందిని సంప్రదించాలన్నారు. రంజాన్‌మాసంలో విద్యుత్ సమస్యల ఫిర్యాదుల కోసం సెంట్రల్ కంట్రోల్‌రూమ్ ఏర్పాటు చేశామన్నారు. పాతబస్తీలోని చార్మినార్ డివిజన్ పరిధిలో ఎలాంటి విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్

గోల్కొండ: సమస్యలు తన దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరిస్తానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో మజ్లిస్ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ డివిజన్లలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడానికి తాను సిద్ధంగా ఉన్నానన్నారు. రంజాన్ నెలలో తాగునీటి సమస్యలపైనే ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కార్వాన్ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో ఎలాంటి అంతరాయం రాకుండా నల్లాలో తాగునీరు సరఫరా అవుతుందన్నారు. లోప్రెషర్ ఇతర సాంకేతిక కారణాల వల్ల నీరు తక్కువగా వస్తుందని అలాంటి ప్రాంతాలను గుర్తించాలన్నారు. ఉపవాస దీక్షలు విరమణ తర్వాత మసీదుల వద్ద వ్యర్థాలు కుప్పలుగా ఉండకూడదని తాను శానిటేషన్ అధికారులకు చెప్పానన్నారు. రంజాన్ పండుగ ప్రార్థనలకు ముస్తాబవుతున్న మసీదులకు అవసరమైన సహకారం అందిస్తానన్నారు. గోల్కొండ కోట సమీపంలోని చారిత్రాత్మకమైన కుతుబ్‌షాహీ ఈద్గాతో పాటు ఇతర ఈద్గాలను పరిశీలించి ఏర్పాట్లు పూర్తయ్యేలా చూస్తానన్నారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, నాయకులు అమీర్, హారూన్‌ఫరాన్, అలీముద్దీన్ తదితరులున్నారు.

మహావీర్ ఆస్పత్రిలో డీలక్స్ గదులు

నాంపల్లి: మాసబ్‌ట్యాంక్‌లోని మహావీర్ ఆస్పత్రి గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో రోగుల సౌకర్యం కోసం డీలక్స్ గదులు ప్రారంభమయ్యాయి. ఏషియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంటరాలజీ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. జీర్ణ వ్యవస్థను ప్రభావితం చేసే రుగ్మతలను తొలగించడమే గ్యాస్ట్రో ఎంటరాలజీ ప్రత్యేకత అన్నారు. జీర్ణ వాహిక (అన్నవాహిక, కడుపు, చిన్న ప్రేగు, పెద్ద ప్రేగు, పురీషనాళం, పాయువు, ప్యాంక్రియాస్, కాలేయం, పిత్త వాహికలు, పిత్తాశయం వంటి అవయవాలకు సంబంధించిన వ్యాధులు విపరీతంగా పెరుగుతున్నాయన్నారు. కులమతాలకు అతీతంగా నిరుపేదలకు నాలుగు దశాబ్దాలకు పైగా సేవలందిస్తున్న మహావీర్ ఆస్పత్రి ప్రస్తుతం రోగుల మెరుగైన ఆరోగ్య సంరక్షణకు అన్ని విభాగాలను అత్యాధునిక పరికరాలతో అప్‌గ్రేడ్ చేయడం సంతోషంగా ఉందన్నారు. చంద్రకళాదేవి కాంతిలాల్ నహర్, డాక్టర్ రూపేంద్రప్రసాద్, మహేంద్ర రంకా, సుశీల్ కపాడియా, సుశీల్ సంచేటి, సుశీల్ పహాడే, డాక్టర్ ఆశా ఖీవ్‌సారా, డాక్టర్ ఘిసులాల్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

పీవీపై రచించిన 'జాతిరత్నం' మార్గదర్శకం



ఎలనాగను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

గన్‌ఫౌండ్రీ: దేశానికే గర్వకారణమైన మహోన్నత వ్యక్తి పీవీ నరసింహారావు తన తండ్రి కావడం తనకెంతో గర్వకారణంగా ఉందని శాసనమండలి సభ్యులు సురభి వాణీదేవి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో జయమిత్ర సాహిత్య సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఆచార్య చెన్నకేశరెడ్డి 80వ జన్మదినం సందర్భంగా కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ నవీన్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందిన ఎలనాగలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... పీవీ నరసింహారావుపై రచించిన గ్రంథం అందరికి మార్గదర్శకమన్నారు. అనంతరం 80 వసంతాలు పూర్తి చేసుకున్న పలువురు సాహిత్యకారులను ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాళోజీ పురస్కార గ్రహీత అమ్మంగి వేణుగోపాల్, మాజీ మంత్రి డీకే సమరసింహారెడ్డి, ఓయూ తెలుగుశాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు, కవి ఆచార్య లక్ష్మీనారాయణ, కేంద్ర సాహిత్య అకాడమీ సలహా మండలి సభ్యులు నాళేశ్వరం శంకరం తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఆదర్శం మోదీ పాలన



బీజేపీ నాయకులతో మాధవీలత

చాంద్రాయణగుట్ట: బీజేపీ హైదరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి కొంపల్లి మాదవీలత ఆదివారం చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో పర్యటించారు. ఉప్పుగూడ, లలితాబాగ్, జంగమ్మెట్, చాంద్రాయణగుట్ట, బార్కాస్, రియాసత్‌నగర్, కంచన్‌బాగ్ డివిజన్లలో ఆమె పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 'ఛాయ్ పే చర్చా' కార్యక్రమంలో పాల్గొన్నారు. గడిచిన పదేళ్లలో ప్రధాని నరేంద్ర మోదీ దేశాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లారన్నారు. పాతబస్తీలో దశాబ్దాలుగా తిష్టవేసిన మజ్లిస్ పార్టీ ఈ ప్రాంత అభివృద్ధికి మోకాలడ్డుతుందన్నారు. అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీజేపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రజలందరి ఆదరాభిమానాలతో ఘన విజయం సాధిస్తానని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నాయకులు కొడీ మహేందర్, పండరీనాథ్, చిరంజీవి, పొన్న శ్రీనివాసరావు, ధర్మతేజ, బర్ల శ్రీనివాస్, సతీష్‌చంద్ర, సురేష్ తదితరులున్నారు.



బీజేపీ సీనియర్ నాయకులు జగ్జీవన్‌రెడ్డి దంపతులతో..

పరామర్శ..

ఇటీవల అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన బీజేపీ సీనియర్ నాయకులు కందాడి జగ్జీవన్‌రెడ్డిని బీజేపీ హైదరాబాద్ ఎంపీ అభ్యర్థి మాధవీలత ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.

మాతృ ప్రేమతో పరిపాలనే లక్ష్యం



మాట్లాడుతున్న శ్రీధర్

సుల్తాన్‌బజార్: ఇండియన్ ప్రజా కాంగ్రెస్ (ఐపీసీ) పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థిగా ఆ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, వికలాంగ్ జంగ్ విభాగం జాతీయ అధ్యక్షులు శివలంక నాగ ఉదయ లక్ష్మిని బరిలో నిలుపుతున్నట్లు ఐపీసీ పార్టీ జాతీయ అధ్యక్షులు కెబి.శ్రీధర్ ప్రకటించారు. ఈ మేరకు ఆదివారం హైదర్‌గూడలో ఆయన మాట్లాడుతూ.. మాతృప్రేమతో పరిపాలన తమ పార్టీ లక్ష్యమన్నారు. తమ పార్టీ అభ్యర్థులుగా గెలిపిస్తే అత్యంత సామాజిక బలహీన వర్గమైన దివ్యాంగులను అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తామన్నారు. వాసుదేవరావు, భాస్కర్, అల్లాజీ యాదవ్, కొండల్‌రావు, సరిత, నవీనరాణి, నాగభూషణం తదితరులున్నారు.

మక్కా మసీదులో రంజాన్ సందడి

- దేశంలో గల అతిపెద్ద పురాతన మసీదు
- నిర్మాణంలో ఎక్కడ మట్టిని వాడలేదు
- 77 ఏళ్ల పాటు నిర్మాణం



చార్మినార్: మక్కా మసీదులో రోజంతా రంజాన్ సందడి నెలకొంది. నగర ప్రజలే కాకుండా ఇతర జిల్లాలు, రాష్ట్రాల ముస్లింలు మక్కా మసీదును సందర్శించి ఇక్కడ జరిగే రంజాన్ ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. దీంతో మక్కా మసీదు ప్రాంగణం పూర్తిగా ముస్లింలతో కళకళలాడుతోంది. రంజాన్ మాసం సందర్భంగా ముస్లింలు రోజంతా కఠోర ఉపవాస దీక్షలు కొనసాగిస్తూ.. రోజుకు ఐదుసార్లు నమాజ్ చేస్తారు. చాలా మంది సామూహిక ప్రార్థనలను మక్కా మసీదులో నిర్వహించడానికి ఇష్టపడతారు. అంతే కాకుండా సాయంత్రం ఉపవాస దీక్షల అనంతరం నిర్వహించే ఇఫ్తార్ విందులు కూడా మక్కా మసీదు ప్రాంగణంలో నిర్వహించడానికి ఆసక్తి చూపిస్తారు. దీంతో రోజూ ఉదయం నుంచి రాత్రి తరావీ ప్రార్థనల వరకు మక్కా మసీదు సందడిగా మారుతోంది. మక్కా మసీదులో సామూహిక ప్రార్థనలు చేయడానికి ముస్లింలు ఆసక్తి చూపిస్తుండటంతో ఎటుచూసినా ఆధ్యాత్మిక వాతావరణం కనిపిస్తుంది.

దేశంలో అతి పెద్ద పురాతన మసీదు..

దేశంలోని అతిపెద్ద పురాతన మసీదులో మక్కా మసీదు ఒకటి. చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడానికి అతి సమీపంలో దక్షిణం వైపున సుమారు 100 గజాల దూరంలో మక్కా మసీదు ఉంది. మహ్మద్ ప్రవక్త మక్కాలో నిర్మించిన మసీదు నుంచి కొన్ని రాళ్లు తీసుకొచ్చి ఇక్కడి మసీదు నిర్మాణ సమయంలో ఉపయోగించారని.. అందుకే ఈ మసీదుకు మక్కా మసీదని పేరొచ్చిందని చరిత్రకారుల అభిప్రాయం. మక్కా మసీదు ఆవరణలో ఎడమ వైపు ఉన్న బల్లపై ఒకసారి కూర్చుంటే...మక్కా మసీదు సందర్శన కోసం మళ్లీ వస్తారనేది నమ్మకం.

మక్కా మసీదు నిర్మాణంలో ఎక్కడ మట్టిని వాడలేదు..

మక్కా మసీదు నిర్మాణంలో ఎక్కడ మట్టిని వాడలేదు. రాళ్ల పొడిని మాత్రమే ఉపయోగించారు. మక్కా మసీదు నిర్మాణానికి ఉపయోగించిన రాళ్లను మహబూబ్‌నగర్ జిల్లా షాద్‌నగర్ సమీపంలోని ఓ పెద్ద రాతి కొండను ఎంపిక చేశారు. కొండను తొలిచి ఎత్తైన రాళ్లతో మక్కా మసీదు నిర్మాణం జరిగింది. ఆ రాళ్లను ఎండ్ల బండ్ల ద్వారా మక్కా మసీదుకు తీసుకొచ్చారు.

77 ఏళ్ల పాటు నిర్మాణ పనులు..

మక్కా మసీదు నిర్మాణం 1617 లో ప్రారంభమైంది. దాదాపు 77 సంవత్సరాల పాటు ఈ నిర్మాణ పనులు జరిగి 1690లో పూర్తయ్యాయి. మక్కా మసీదు ఎత్తు 176 అడుగులు, మక్కా మసీదు లోపల 67 మీటర్ల పొడవు, 54 మీటర్ల వెడల్పు, 23 మీటర్ల ఎత్తు గల విశాలమైన ప్రార్థనలు హాల్ ఉంది. దాదాపు ఒకేసారి 3 వేల మంది ఈ హాల్‌లో ప్రార్థనలు చేసుకోవడానికి అవకాశాన్ని కల్పించారు. మసీదుకు దక్షిణంలో ఐదుగురు ఆసఫ్ జాహి రాజులు, వారి కుటుంబ సభ్యుల సమాధులు 14 ఉన్నాయి.

నోరూరిస్తున్న పిండి వంటలు..





వినియోగదారుల సందడి నెలకొంది.

చార్మినార్: రంజాన్ పిండి వంటలు నోరూరిస్తున్నాయి. సాధారణ రోజుల కంటే ప్రస్తుతం రంజాన్ మాసంలో వీటికి గిరాకీ ఎక్కువగా ఉంటుంది. చిరు వ్యాపారులకు ఈ మాసంలో ఆశించిన గిరాకీ ఉంటుంది. ఉపవాస దీక్షల విరమణ అనంతరం మిర్చీలు, బజ్జీలు, ఆలుబోండాలు, ఆలు బజ్జీలు, పునుగులు, కచోరీ, సమోస, ఆలు సమోస, మైసూర్ బజ్జీలు, వడ, శనగపిండి వడలను ఇష్టంగా తింటారు. రోజంతా ఉపవాస దీక్షలో ఉన్న వారందరూ వీటి కోసం ఎగబడతారు. దీంతో పాతబస్తీలో మిర్చీ బండీలతో పాటు పిండి వంటల దుకాణాల వద్ద వినియోగదారుల సందడి నెలకొంది. ఇఫ్తార్‌లో పిండి వంటలకు ఎక్కువగా ప్రాధాన్యత ఉంటుంది. తక్కువ ధరలకు లభించే దహీవడా తదితర వంటకాలపై పేద, మధ్యతరగతి ప్రజలు ఎక్కువగా మొగ్గు చూపుతారని, వారి నుంచే తమకు గిరాకీ ఉంటుందని చిరువ్యాపారులు చెబుతున్నారు.

ఆకట్టుకున్న 'ఖీరత్'



ఖీరత్ వినిపిస్తున్న ఓ బాలుడు

గోల్కొండ: రంజాన్ మాసం చివరి ఉపవాస దీక్షలు ఎంతో ముఖ్యమైనవని మౌలానా ఖారీ సయ్యద్ మతీన్ అలీషాఖాద్రీ అన్నారు. ఆదివారం గోల్కొండ రిసాలబజార్‌లో ఆల్ ఇండియా ఖీరత్ కమిటీ ఆధ్వర్యంలో చిన్నారులు, మదర్సాలో చదివే విద్యార్థులకు ఖీరత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు చిన్నారులు ఖీరత్‌ను చక్కగా వినిపించి శభాష్ అనిపించుకున్నారు. ఖీరత్ చదివిన వారికి అక్తరీ మసీదు కమిటీ ఆధ్వర్యంలో ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మతీన్‌అలీషా ఖాద్రీ మాట్లాడుతూ.. పిల్లల్లో చిన్ననాటి నుంచే ఖీరత్ గురించి వివరించాలన్నారు. మదర్సాల నిర్వాహకులు కేవలం ఖురాన్ గ్రంథాన్ని పిల్లలచే కంఠస్తం చేయించడమే కాకుండా ఖీరత్‌పై కూడా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు.

అలరించిన సంగీత విభావరి



సంగీత విభావరి ప్రదర్శనలో కళాకారులు

విజయనగర్‌కాలనీ: వీణుల విందు చేసే గిటారు వాయిద్యం, ఆకట్టుకునే సంగీతం ప్రేక్షకులను మంత్ర ముగ్ధుల్ని చేశాయి. మాసబ్‌ట్యాంక్ జవహర్‌లాల్ నెహ్రూ ఆర్కిటెక్చర్ అండ్ ఫైనార్ట్స్ యూనివర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియం హాల్‌లో ఆదివారం సంగీత విభావరి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పండిట్ సుబేంద్రరావు, డాక్టర్ అశ్వినీలు సంగీత ప్రదర్శన ప్రేక్షకులకు వీణుల విందు చేసింది. సంగీత విభావరిలో భాగంగా నిర్వహించిన గిటారు వాయిద్యం, గాత్ర కచేరీలు ఆకట్టుకున్నాయి.

కఠోరా హౌజ్ నీరు పంపింగ్



డ్రైనేజీ పైపులైన్‌లోకి వదులుతున్న కఠోరా హౌజ్ నీరు

గోల్కొండ: చారిత్రక కటోరా హౌజ్‌లోని నీటిని విద్యుత్ మోటర్లు పెట్టి తోడుతున్నారు. గత రెండ్రోజులుగా గోల్కొండలోని చారిత్రక కటోరా హౌజ్ వెనుకభాగంలో మోటర్లను బిగించి హౌజ్‌లోని నీటిని బయటకు వదులుతున్నారు. ఈ నీటిని ఎవరు వదలుతున్నారనేది తమకు అర్థం కావడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ఆరోగ్య సంరక్షణపై అవగాహన ర్యాలీ



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ప్రతినిధులు

చార్మినార్: ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కు కోగలడని గాంధీ ఆస్పత్రి జనరల్ మెడిసిన్ సీనియర్ అసోసియేట్ ప్రొఫెసర్, తెలంగాణ వైద్య మండలి సభ్యురాలు డాక్టర్ ప్రతిభాలక్ష్మి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్రశాఖ ఆధ్వర్యంలో పూల్‌బాగ్ చమన్‌లో వివిధ రోగాలపై అవగాహన శిబిరంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆరోగ్యం ఎంతో అవసరమని, పౌష్టికాహారం తీసుకుంటూ.. వ్యాధులకు దూరంగా ఉంటూ ఆరోగ్యంగా ఉండాలన్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి డాక్టర్ భరత్‌ప్రకాష్‌తో పాటు సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్, పాతబస్తీ టీపీసీ అధ్యక్షులు రామక్రిష్ణ శబ్బుస్తీ, గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ సెల్ ఉపాధ్యక్షులు కాశమోని శ్యామ్‌రావు ముదిరాజ్ పాల్గొన్నారు.

మేరు కులస్తులకు ప్రాధాన్యమివ్వాలి



గురుదీప్ సింగ్ సత్పాల్‌తో పోల్కం శ్రీనివాస్

అబిడ్స్: ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకులు గురుదీప్ సింగ్ సత్పాల్‌ను తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కాంగ్రెస్ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ కలిశారు. మేరు కులస్తులకు చట్ట సభల్లో సముచిత ప్రాధాన్యత ఇవ్వాలని ఆయనను విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్సీ, కార్పొరేషన్ చైర్మన్‌లో పాటు రాజ్యసభ స్థానాలు కూడా మేరు కులస్తులకు కేటాయించాలని ఆదివారం ఆయన మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రూ.20 లక్షలకు పైగా జనాభా ఉన్న మేరు కులస్తులకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేకంగా గుర్తింపునిచ్చి అన్ని పదవులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ స్థానాల్లో సైతం తమ కులస్తులంతా కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారన్నారు.

అడుగంటుతున్న భూగర్భ జలాలు..

ఇష్టానుసారంగా బోర్లు వేస్తున్న వైనం



షేక్‌పేట్‌లో బోరు వేస్తున్న దృశ్యం

గోల్కొండ: భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో కనీస అవసరాలకు నీరు వాడాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో గత్యంతరం లేక బోర్ల లోతును పెంచడం, కొత్త బోర్లు వేయడానికే ప్రజలు మొగ్గు చూపుతున్నారు. దీంతో బోర్లు వేసే బోర్ మోటర్లకు డిమాండ్ బాగా పెరిగింది. షేక్‌పేట్, గోల్కొండ, లంగర్‌హౌజ్ తదితర ప్రాంతాల్లో ఎటు చూసిన నీటి ఆహాకారాలే వినిపిస్తున్నాయి. జలమండలి ట్యాంకర్ తెప్పుకోవాలంటే అది ఎప్పుడు దొరుకుతుందో తెలియని పరిస్థితి. ట్యాంకర్ కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నా.. ఎదురు చూపులే మిగులుతున్నాయి. తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు నీటి వ్యాపారులనే ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉంది. తమకు తెలిసిన వారికే గుట్టుచప్పుడు కాకుండా నీటిని అమ్ముకుంటున్నారు. దీంతో కొత్త బోర్‌ను వేసుకుంటే తిప్పలు తగ్గుతాయని బోర్లు వేస్తున్నారు.

పొరుగు వారితో ఫైట్లు..

బోరు వేస్తున్న సదరు ఇంటి యజమానికి ఇరుగుపొరుగు ఇళ్ల వారి నుంచి ఫైట్లు తగ్గడం లేదు. మీ బోరు వల్ల మా బోరు ఎండిపోయే ప్రమాదం ఉందని పొరుగు వారు వచ్చి ఫైట్లు చేస్తున్నారు. పలుచోట్ల కొట్లాట ఎందుకు అంటూ సర్దుకుపోదామని రాజీలకు వస్తున్నారు. రాజీఫార్ముల సైతం నీటిని పంచుకోవడం పైనే ఆధారపడి ఉంది. నీరు బాగా పడితే మీకు ఇంత ఇస్తామంటూ.. బోరు వేసే వారు బేరాలు చేసుకుని బోరు వేసుకుంటున్నారని వినికిడి.

వైట్‌హౌస్ సెట్‌తో హ్యాండీ క్రాఫ్ట్ మేళా

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ సంగం వద్ద వైట్ హౌస్‌ను తలపించేలా హ్యాండ్‌క్రాఫ్ట్స్ మేళా రూపుదిద్దుకుంటుంది. చిన్నారులు, పెద్దలను ఆకర్షించేలా నూతన సెట్‌లతో అందమైన ప్రసిద్ధ ఆకృతులను తయారుచేయడం వీరి ప్రత్యేకత. నిర్వాహకుడు రాబ్సన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ ఇన్‌ఫాస్ట్ హ్యాండ్లూమ్ హ్యాండీ క్రాఫ్ట్ మేళా లక్షల జనాల మన్ననలు పొందింది. ప్రస్తుతం లంగర్‌హౌస్ సంగం వద్ద ఈ సెట్ ఏర్పాటు జరుగుతుంది. ఈ మేళాలో పిల్లలు ఆడుకునేందుకు మరిన్ని కొత్త వస్తువులను ఏర్పాటు చేయడంతో పాటు, మగువలను ఆకట్టుకునే వివిధ వస్తువులను అమ్మకానికి అందుబాటులో ఉంచుతామని రాబ్సన్ చెప్పారు.

గుడిమల్కాపూర్ బీజేపీ నేతలను వరించిన పదవులు

గోల్కొండ: గుడిమల్కాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ నాయకులకు పార్టీ అధిష్టానం పదవుల పందేరం చేపట్టింది. వచ్చే పార్లమెంటు ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఆ పార్టీ కీలకమైన పదవులను బీజేపీ, బీజేవైఎం నాయకులకు కట్టబెట్టింది. నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల్లో వ్యూహాత్మకంగా సీనియర్ నాయకులకు నియమించింది. బీజేపీ హైదరాబాద్ పార్లమెంటు నియోజకవర్గానికి సీనియర్ నాయకుడు దేవర శ్రీనివాస్‌ను పబ్లిసిటీ కమిటీగా నియమించింది. కార్వాన్ నియోజకవర్గానికి చెందిన యోగ్‌రాజ్‌సింగ్‌ను బీజేవైఎం రాష్ట్ర కోశాధికారిగా నియమించింది. మరోవైపు బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా కార్యదర్శిగా యువ నాయకుడు దేవర వంశీని నియమించింది. గతవారం పదవులకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడిన వెంటనే పార్టీ కేడర్‌లో నూతన ఉత్సాహం వచ్చింది. ఏదేమైనా పార్టీ బలోపేతానికి చేపడుతున్న ఈ పదవుల నియామకంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

పురస్కారాల ప్రదానం



పురస్కారాలను అందజేస్తున్న సినీనటుడు మాణిక్‌రావు

గన్‌ఫౌండ్రీ: పురస్కారాలు సమాజంలో బాధ్యతను మరింత పెంచుతాయని 'మా' మూవీ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మాణిక్‌రావు అన్నారు. ఆదివారం హైదర్‌గూడలో ఇందిరా ఆర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న పలువురికి ఉగాది పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురస్కారాలు మన సేవకు గుర్తింపును ఇవ్వడంతో పాటు ఇతరులకు స్ఫూర్తిని కలిగిస్తాయన్నారు. సామాజికవేత్త డాక్టర్ ఆలూరి విల్సన్, హాస్య బ్రహ్మ శంకర నారాయణ, సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ ఇందిర తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ కిట్ల పంపిణీ



గోల్కొండ: పేదలు సైతం రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలన్నదే తమ ఆశయమని గోల్కొండ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ జాకేర్ అన్నారు. ఆదివారం గోల్కొండ బంజారా దర్వాజ వద్ద ఆయన ఆధ్వర్యంలో పేదలకు రంజాన్‌కిట్లతో పాటు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహ్మద్ జాకేర్ మాట్లాడుతూ.. గత రెండు దశాబ్దాలుగా తాను ప్రతిఏటా రంజాన్ మాసంలో 100 మంది పేదలకు రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్నానన్నారు. గతంలో కోవిడ్ విజృంభించిన సమయంలోనూ తాను నిరుపేద కూలీలు, ఉపాధి కోల్పోయిన వలస కార్మికులకు నిత్యవసరాలు పంపిణీ చేసినట్లు వివరించారు. సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అమీదుద్దీన్ తహసీన్ తదితరులున్నారు.

సన్మానం



గోల్కొండ: సబ్జిమండిలో తెలంగాణ మత్స్య సహకార కో– ఆపరేటివ్ సొసైటీ సమాఖ్య చైర్మన్ మెట్టు సాయికుమార్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్స్య సహకార సంఘాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మత్స్యకారుల సంక్షేమం కోసం తాను ఎప్పుడూ.. కృషి చేస్తున్నానన్నారు. హైదరాబాద్ మత్స్యశాఖ చైర్మన్ కొప్పు పద్మ, సబ్జి మండి మత్స్య సహకార సంఘం అధ్యక్షులు లింగం, ప్రధాన కార్యదర్శి మురారి రాంబాబు, ఉపాధ్యక్షుడు ఎం.బాలనర్సింహ్మ, కోశాధికారి బాబు, సంఘం డైరెక్టర్లు అభిమన్యు, కట్ట స్వామి తదితరులు పాల్గొన్నారు.

నిరంతర సాధన అవసరం

గన్‌ఫౌండ్రీ : సివిల్స్‌కు సన్నద్ధమయ్యే అభ్యర్థులు పట్టుదల, ఏకాగ్రత కలిగి ఉండాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఆదివారం రవీంద్రభారతిలో నారాయణ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 'సివిల్స్ సన్నద్ధం అవ్వడం ఎలా.. ?' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సివిల్స్‌కు నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు. తన చిన్నతనంలో చోటు చేసుకున్న ఘటనలు, తన తండ్రితో ఉన్న అనుభవాలను అభ్యర్థులతో పంచుకున్నారు. చిన్న చిన్న విషయాలతో పాటు అనేక విషయాల గురించి అభ్యర్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన ఎంతో ఓపికగా సమాధానం చెప్పారు. సివిల్స్ విద్యార్థుల కోసం ఇలాంటి సదస్సులు నిర్వహించడం అభినందనీయమన్నారు. పరిశోధన, అభివృద్ధి ఎంతో కీలకమని అభ్యర్థులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్ విశ్రాంత చీఫ్ సెక్రటరీ మోహన్ కందా, అకాడమీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బలహీన వర్గాల సంక్షేమానికి కృషి



సమావేశంలో బజ్జు యాదవ్ తదితరులు

అబిడ్స్: ఐహీర్ యాదవ సమాజ్ ఆధ్వర్యంలో తరచూ సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు సామాజ్ రాష్ట్ర నాయకులు బజ్జు యాదవ్ పేర్కొన్నారు. తమ సమాజ్ నిరంతరం బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఆయన మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందరికి అందేలా కృషి చేస్తామన్నారు. నీలేందర్‌యాదవ్, ఆనంద్‌కుమార్‌గౌడ్, పరశురామ్‌యాదవ్, వైకుంఠం, గోపాల్‌యాదవ్, పుష్పరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ

అబిడ్స్: గుడిమల్కాపూర్ సాయిబాబా ఆలయం వద్ద ప్రజల దప్పిక తీర్చేందుకు మజ్జిగ వితరణ చేశారు. ఆదివారం ఆలయ నిర్వాహకులు, సంఘ సేవకులు హన్మంత్‌రెడ్డి మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సేవాభావంతోనే మానసిక తృప్తి ఉంటుందని పేర్కొన్నారు.

